
ఆంధ్రజ్యోతి
5
వరంగల్ ఉమ్మడి జిల్లా
శుక్రవారం 15 నవంబరు 2024




హనుమకొండలో దీపాలు, ఉసిరి కొనుగోలు చేస్తున్న మహిళలు

కార్తీక శోభితం..

నిండుపౌర్ణమి వేళ అభిషేకాలు, దీపోత్సవాలు

- నేటి వేడుకలకు ముస్తాబైన శైవ క్షేత్రాలు, ఆలయాలు
- వేయిస్తంభాల గుడిలో లక్షదీపార్చన
- హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ


ఉత్సవాలకు సిద్ధమైన కొడవటూరు సిద్దులగుట్ట

హనుమకొండ కల్చరల్/ వరంగల్ కల్చరల్/ జనగామ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శివకేశవులకు ప్రీతికరమైన.. పవిత్ర కార్తీక మాసంలో కృత్తికా నక్షత్రంలో నిండు పౌర్ణమి వేళ వచ్చే కార్తీక పౌర్ణమి పర్వదినం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలు, ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతీ ఇంటా భక్తులు ఉసిరిక స్నానాలు చేయడం, బ్రహ్మీ ముహూర్తంలో తెల్లవారుజామునే అభ్యంగన స్నానాలు చేసి కార్తీక వొత్తులు వెలిగించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఇంటింటా లక్ష్మీదేవిగా కొలుస్తూ తులసీ మాతకు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేయడం ఈ పర్వం ప్రత్యేకత. దీపావళి నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస పూజలు పౌర్ణమి రోజున మరింత విశిష్టంగా జరుగుతాయి. దీనికి తోడు కార్తీక పౌర్ణమి రోజున శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించడం కూడా అనాదిగా వస్తోంది. కార్తీక పూజల్లో ముఖ్యమైన ఉసిరి కొమ్మలు, కాయలతో పాటు పూలు, వివిధ రకాల పండ్ల అమ్మకాలతో నగరంలో సందడి కనిపించింది. హనుమకొండ, వరంగల్ చౌరస్తాలతో పాటు అనేక ప్రధాన కూడళ్లలో రద్దీ కనిపించింది. అలాగే జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు పలు పట్టణాలు, మండల కేంద్రాల్లోని పలు ఆలయాలను, ప్రసిద్ధ శైవ క్షేత్రాలను ముస్తాబు చేశారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామివార్లను దర్శించుకునేలా, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసేలా ఏర్పాట్లు చేశారు.

వేయిస్తంభాల ఆలయంలో ఇలా..

వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేకంగా లక్ష దీపోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. దేవాదాయ శాఖ సహకారంతో ఉదయం 5గంట నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు జరిగే లక్షదీపోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సహా పలువురు

మిగతా 6వ పేజీలో...

కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పర్వదినం సందర్భంగా గురువారం వైకుంఠ చతుర్దశి పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరిమాతకు చీర, సారె, కుంకుమ, పసుపులతో ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహన్యాసాక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం, శుభానందదేవి ఆలయంలో అమ్మవారికి కుంకమ పూజలు నిరవహించారు. సరస్వతిదేవి ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గు లు వేసి లక్ష వత్తులతో దీపాలను ముట్టించి బ్రాహ్మణోత్తములను దీపా దానం అందజేశారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామునుంచే ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.


కాళేశ్వరం ముక్తీశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



లొంగిపోయిన మావోయిస్టుకు చెక్కును అందజేస్తున్న సీపీ

మహిళా మావోయిస్టు లొంగుబాటు

- అనారోగ్యంతో లొంగిపోయిన మంజుల అలియాస్ నిర్మల
- రూ.20 లక్షల రివార్డు చెక్కు అందజేసిన సీపీ

హనుమకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో సీపీఐ మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ మహిళా సభ్యురాలు కొడి మంజుల అలియాస్ నిర్మల గురువారం సీపీ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన మంజుల తండ్రి పీపుల్స్‌వార్‌కు సానుభూతిపరుడిగా పనిచేయడంతో పాటు ఆమె అన్న కుమారస్వామి అలియాస్ ఆనంద్, దగ్గరి బంధువు కోడి వెంకన్న అలియాస్ గోపన్న నర్సంపేట దళ కమాండర్‌గా పని చేసి ఎదురు కాల్పుల్లో మరణించారు. వారి ప్రభావంతో పాటు పీపుల్స్‌వార్ సిద్ధాంతాలకు ప్రభావితమైన మంజుల.. టెన్త్ మధ్యలో చదువు ఆపేసి 1994లో పీపుల్స్‌వార్ గ్రూపు నర్సంపేట దళంలో చేరింది. ఆ తర్వాత చేర్యాల దళంలో పని చేసింది. 1999లో నర్సంపేట దళకమాండర్ పెరం బుచ్చయ్యను వివాహం చేసుకుంది. 2000లో బుచ్చయ్య పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనంతరం 2001లో మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ సారథ్యంలో ప్రెస్ టీం ప్రొటెక్షన్ ప్లాటూన్‌లో యేడాది పనిచేసి 2002లో మహదేవపూర్ డిప్యూటీ దళ కమాండర్‌గా పనిచేస్తున్న క్రమంలో డివిజనల్ కమిటీ మెంబర్ కుకటి వెంకట్ అలియాస్ రమేశ్‌ను వివాహం చేసుకుంది. వైద్యం కోసం మరో మహిళా దళ సభ్యురాలితో భూపాలపల్లికి వచ్చి 2002 డిసెంబర్ 24 పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లింది. 2004లో జైలు నుంచి విడుదలై తిరిగి మావోయిస్టులతో సంబంధాలు కొనసాగిస్తూ మహదేవపూర్ దళసభ్యురాలిగా బాధ్యతలు చేపట్టింది. 2005లో మాహదేవపూర్, చేర్యాల, మహరాష్ట్ర, సిరోంచ, డిప్యూటీ కమాండర్‌గా పనిచేసింది. 2007 నుంచి మణుగూర్ దళ కమాండర్‌తో పాటు పార్టీ ఆదేశాల మేరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలో ఏరియా కార్యదర్శిగా, వైద్య బృందానికి బాధ్యురాలిగా 2011 వరకు పనిచేసింది. అ తర్వాత 2021 వరకు బస్తర్‌లో వివిధ క్యాడర్‌లో పనిచేసి 2022లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలుగా మంజుల బాధ్యతలు స్వీకరించింది. 2013లో దర్బా డివిజన్‌లో జీరంఘాటి ప్రాంతంలో 27 మంది పోలీసులను హత్య చేసిన ఘటనతో పాటు చిట్యాల, నర్సంపేట, ఏటూరునాగారం, నెక్కొండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసులుపై జరిపిన కాల్పులో మంజుల నిందితురాలిగా ఉంది.

కాగా, ఆనారోగ్య సమస్యలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాసం పట్ల ఆకర్షితులై మంజుల లొంగిపోయినట్లు సీపీ తెలిపారు. కాగా, ఆమెపై ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షల రివార్డు చెక్కును అందజేశామన్నారు. తెలంగాణలో నక్సలిజంకు ఎలాంటి ఆదరణ లేదని, అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఎస్సై రఘుపతి పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ క్రీడలు

ములుగు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జాకారం గురుకులంలో ఈనెల 11 నుంచి 14 వరకు జరిగిన రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ స్కూల్ 10వ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఎస్పీ శబరీశ్ హాజరయ్యారు. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా కెరియర్‌గా కూడా ఎంచుకోవచ్చన్నారు. విద్యార్థులు సన్మార్గంలో నడిచి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. అనంతరం ఆల్ రౌండ్ పర్ఫార్మెన్స్ ట్రోఫీని జాకారం గురుకులం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ అధికారి అరుణ కుమారి, డీసీవో శ్రీనివాసరావు, భిక్షపతి, జోనల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కాళేశ్వరం జోన్ ప్రిన్సిపాళ్లు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



జాకారం గురుకులం విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ శబరీశ్

కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే

మహబూబాబాద్ జిల్లాలో ఆరు రోజుల్లో 1,19,757 కుటుంబాల గణన పూర్తి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వేగవంతంగా కొనసాగుతోంది. మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, మానుకోటలతో పాటు 18 మండలాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మొత్తంగా కలిపి 2,66,603 కుటుంబాలను గుర్తించారు. ఈనెల 14 వరకు 1,19,757 (44.9 శాతం) కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. కాగా, జిల్లాలోని 18 మండలాల పరిధిలో 2,27,758 కుటుంబాలకు గాను 1,01,462 కుటుంబాల సర్వే పూర్తయింది. నాలుగు మునిసిపాలిటీల పరిధిలో 38,845 కుటంబాలకు గాను 18,295 కుటంబాల సర్వే పూర్తయింది.



కొత్తపేటలో సర్వే చేస్తున్న అధికారులు



గూడూరులో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి

ఈ నెల 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటంబ సర్వే ఆరంభం కాగా 8 వరకు సర్వే చేపట్టే ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ యాజమాని పేర్లు రాసుకుని ఇంటికి స్టిక్కర్‌ను వేశారు. ఈనెల 9 నుంచిపూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలతో పాటు కులగణన ప్రారంభమైంది. తొలి రెండురోజులు కాస్త నెమ్మదిగా సాగిన సర్వే క్రమక్రమంగా వేగం పుంజుకుంది. ఆరు రోజుల్లో 1,19,757 కుటుంబాల సర్వే పూర్తి చేశారంటే సగటున ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా 20 వేల కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. ఈనెల 21 వరకు ఇం టింటి సర్వే కొనసాగించి వివరాలను ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

జిల్లాలో ఈ నెల 14 వరకు సర్వే వివరాలు

మండలం	కుటుంబాలు సర్వే	పూర్తయినవి
బయ్యారం	15414	7277
చిన్నగూడూరు	5347	2840
దంతాలపల్లి	9724	5210
డోర్నకల్	12623	5054
గంగారం	3791	1858
గార్ల	13,228	6713
గూడూరు	18572	8311
ఇనుగుర్తి(కేసముద్రం)	3926	1624
ఇనుగుర్తి (నెల్లికుదురు)	2461	982
కేసముద్రం	18686	9114
కొత్తగూడ	10118	4835
కురవి	16712	5806
మహబూబాబాద్	14142	5839
మరిపెడ	20461	8596
నర్సింహులపేట	9990	4025
నెల్లికుదురు	16829	6576
పెద్దవంగర	10045	5768
సీరోలు (డోర్నకల్)	2190	854
సీరోలు (కురవి)	5511	2090
తొర్రూరు	17988	8090
మునిసిపాలిటీలు		
డోర్నకల్	4171	2232
మహబూబాబాద్	21432	10010
మరిపెడ	5293	2699
తొర్రూరు	7949	3354
మొత్తం	2,66,603	1,19,757

మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే ▸ మహదేవపూర్ పీఎస్ తనిఖీ



పోలీసు సిబ్బంది ఆయుధాలు, సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

మహదేవపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘా పెట్టాలని పోలీసు సిబ్బందిని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశించారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, వారు ఉపయోగిస్తున్న ఆయుధాలను, సామగ్రిని పరిశీలించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, పెండింగ్ కేసులపై సత్వర చర్యలు చేపట్టాలని సీఐ రాంచందర్‌రావు, ఎస్సై పవన్‌కుమార్‌ను ఆదేశించారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న దృష్ట్యా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఆయన వెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

'కార్తీక' శోభితం..

(5వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొననున్నారు. ఈ మేరకు గురువారం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వీటితోపాటు కళాబృందాల సంప్రదాయ నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయి. అలాగే హనుమకొండలోని షిరిడీ సాయిబాబా ఆలయం, ములుగు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, దత్తక్షేత్రం, కాజీపేటలోని శ్వేతార్కమూల ఆలయం, హనుమకొండ రాగన్న దర్వాజలోని శ్రీ సీతారామ ఆలయం, చిన్నకోవెల, ఎక్సైజ్‌కాలనీలోని వేంకటేశ్వరాలయం, బాలసముద్రంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాటు చేశాయి. అలాగే వరంగల్ నగరంలోని శ్రీ వరద దత్తక్షేత్రంలో పౌర్ణమి హోమం, అభిషేకం నిర్వహించనున్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలకు ఏర్పాట్లు చేశారు. భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. అలాగే అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, సామూహిక లలిత సహస్రనామ పారాయణం చేస్తారు.

మహిళలు ఆలయాల్లో వత్తులు కాల్చడంతో పాటు దీపాలు వెలిగించి నైవేద్యం నివేదన చేసి పూజలు చేయనున్నారు. 365 వత్తులు, 1008 వత్తులు, లక్ష వత్తులు కాలుస్తారు. పలు చోట్ల ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశారు. వరంగల్ భద్రకాళి ఆలయ రోడ్డులోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో శుక్రవారం ప్రత్యే క పూజలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ టీఆర్. బాలసుబ్రహ్మణ్య శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున అభిషేకం, భక్తుల ముద్రమాలలకు పూజ అనంతరం అయ్యప్ప భక్తుల మాలాధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటిసారి అయ్యప్ప మాల వేసుకునే భక్తులకు ఉచితంగా మాలాధారణ చేసి స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం అందించనున్నట్లు ఆయన వివరించారు.

సోమేశ్వర ఆలయంలో అఖండజ్యోతి

కార్తీక పౌర్ణమి సందర్భంగా దక్షిణ భారతదేశంలో అఖండజ్యోతిని నిర్వహిస్తున్న మూడో దేవస్థానంగా పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి గుర్తింపు ఉంది. ఈ ఆలయంలో శుక్రవారం అఖండజ్యోతి గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో సల్వాది మోహన్‌బాబు తెలిపారు. అరుణాచలం స్ఫూర్తితో పాలకుర్తి ఆలయ గుట్టపై 8 అడుగుల వెడల్పు, 4అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా రూపొందించిన ప్రమిదలో ఒక టన్ను నువ్వుల నూనె, ఆవునెయ్యి, రెండు క్వింటాళ్ల ముద్ద కర్పూరంతో అఖండజ్యోతిని వెలిగించనున్నట్లు తెలిపారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సమక్షంలో లక్ష దీపోత్సవం, గిరి ప్రదక్షిణ, అఖండజ్యోతి 5గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

ఉత్తరకాశి పీఠాధిపతి స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరై అఖండజ్యోతిని ప్రారంభిస్తారన్నారు. అలాగే జనగామ బాణాపురం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో లక్ష దీప మహోత్సవం, కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధానార్చకులు కృష్ణమాచార్య సిద్ధాంతి తెలిపారు.

బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్దులగుట్ట కార్తీకపౌర్ణమి ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం తెలవారుజాము నుంచే సిద్ధేశ్వరుడికి విశిష్ట అభిషేకాలు, అన్నపూజలు, మహారుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించనున్నారు. స్వామి సన్నిధిలో సత్యనారాయణ వ్రతాలు చేసి మొక్కులు చెల్లిస్తారు. ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్ల కోసం సిబ్బంది శ్రీనివాస్, చల్లా లక్ష్మీకాంతరెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డిలను నియమించామని ఈవో చిందం వంశీ తెలిపారు.

అప్పు తీర్చడం లేదని హత్య

జనగామ జిల్లా ఎల్లారెడ్డిగూడెంలో ఘటన

రఘునాథపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకుని డబ్బులు తిరిగి ఇవ్వలేదనే కారణంతో అప్పు ఇచ్చిన వ్యక్తి హత్య చేసిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. గంపల పరశురా ములు(40)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాపీమేస్త్రి పనిచేస్తూ, పెళ్లిళ్ల సీజన్‌లో బ్యాండ్ వాయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది నెలల క్రితం అనారోగ్యానికి గురైన పరశురాములు భార్య చికిత్స కోసం ఇదే గ్రామానికి చెందిన పర్వత మహేందర్ వద్ద అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తీర్చాలని మహేందర్ కొద్దిరోజుల నుంచి కోరుతూ వస్తున్నాడు. ఇదిలా ఉంటే మహేందర్ ఇల్లు కట్టుకోగా పరశురాములు నిర్మాణ పనులు చేపట్టాడు. తీసుకున్న అప్పు ఇంటి పనులతో తీరిందని పరశురాములు, లేదు ఇంకా డబ్బులు రావాలని మహేందర్ ఎవరికివారే చెబుతున్నారు. ఇదే విషయంపై కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. అయితే మహేందర్ నుంచి పరశురాములు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు అప్పు తీసుకుని ఉంటాడని గ్రామస్థులు చెబుతున్నారు. మహేందర్ స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తాడని తెలిసింది.

ఫోన్ చేసి పిలిచి.. భార్యా పిల్లల ఎదుటే హత్య..

పరశురాములు ఎల్లారెడ్డిగూడెంలో బుధవారం రాత్రి జరిగిన పెళ్లి వేడుకల్లో అర్ధరాత్రి వరకు పాల్గొన్నాడు. తర్వాత ఇంటికి వెళ్లి పడుకోవడానికి ఉపక్రమిస్తున్న సమయంలో మహేందర్ అతడికి ఫోన్ చేసి గ్రామంలోని బొడ్రాయి వద్దకు రావా లని కోరాడు. అప్పటికే అతిగా మద్యం సేవించిన మహేందర్, పరశురాములు అక్క డికి రాగానే కత్తి(తల్వార్)తో తలపై వేటు వేశాడు. తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడి కక్కడే కుప్పకూలి మృతి చెందాడు. భర్త వెనుకాలే వెళ్లిన పరశురాములు భార్య సంధ్య, కుమారుడు అనిరుధ్ చూస్తుండగానే మహేందర్ కత్తితో దాడి చేసి హత్య చేశాడు. దీంతో భయభ్రాంతులకు గురై కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారమివ్వగా రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ డి.నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు మహేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ విచారణ చేపట్టారు.

గ్రామంలో విషాదం..

పరశురాములు హత్యకు గురవడంతో ఎల్లారెడ్డిగూడెం విషాదం నెలకొంది. మృతుడి భార్య సంధ్య, కుమారుడు, కుమార్తె రోదన గ్రామస్థులను కలచివేసింది. హత్యకు పాల్పడిన మహేందర్‌పై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తు కఠినంగా శిక్షించాలని పోలీసులను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు కొయ్యడ మల్లేష్, సుధాకర్, కుమార్ పరామర్శించారు.

హత్యకు కారణం ఇదేనా ?

పరశురాములు తన భార్య సంధ్య చికిత్స నిమిత్తం పర్వత హహేందర్ నుంచి రూ.80 వేలు అప్పుగా తీసుకున్నట్లు తెలుస్తుంది. తాపీమేస్త్రీగా పని చేసే పరశు రాములు, మహేందర్‌కు సంబంధించిన కొత్త ఇంటి నిర్మాణం పనులు చేసి అప్పు గా తీసుకున్న డబ్బులు తీర్చినట్లు మృతుడి బంధువులు చెబుతున్నారు. అప్పుగా తీసుకున్న రూ.80 వేలలో సుమారు రూ.50 వేల వరకు మాత్రమే పరశురాములు, అతడి భార్య ఇంటి నిర్మాణ పనులు చేసి అప్పు తీర్చినట్లు తెలుస్తోంది. రూ. 50వేల విలువ గల ఇంటి నిర్మాణ పనులు చేయకుండానే చేసినట్లు చెబుతుండడంతో ఇద్ద రి మధ్య విభేదాలు ఏర్పడినట్లు సమాచారం.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

పరశురాములును హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద హత్యను ఖండిస్తూ గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరశురాములు హత్యపై ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, హంతకుడిపై పీడీ యాక్టు నమోదు చేసి, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, దళితులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొయ్యడ మల్లేష్, జేరిపోతుల సుధాకర్, బొల్ల పల్లి కృష్ణ, గిరిమల్ల రాజు, ప్రభాకర్, రాగల ఉపేందర్, డీ రవి, అబ్బయ్య, ఎల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





హత్యకు గురైన గంపల పరశురాములు



గంజాయిని దహనం చేస్తున్న ఏఎస్పీ జోగుల చెన్నయ్య

రూ.1.28కోట్ల విలువైన గంజాయి దహనం చేసిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సీజ్ చేయబడిన 1.28 కోట్ల విలువైన గంజాయిని కాకతీయ మెడికల్ ఏజెన్సీ, ఉర్సుగుట్ట హన్మకొండలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆదేశాల మేరకు డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ సభ్యులు, ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు సమక్షంలో 515 కేజీల 720 గ్రాముల గంజాయిని గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన 24 కేసుల్లో మొత్తం 515 కేజీల 720 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన గంజాయిని గత కొంత కాలంగా నిల్వ చేసి గురువారం దగ్ధం చేసినట్లు చెప్పారు. గంజాయి, డ్రగ్స్ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, పెండ్యాల దేవేందర్, రాజేష్, బాబురావు, రవి తదితరులు పాల్గొన్నారు.

రక్తపు వాంతులతో వ్యక్తి మృతి

హత్యగా భావించి భయపడిన ప్రజలు



మృతి చెందిన రవీందర్

కేసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున గూడూరు మండలం రాజన్‌పల్లి కాలనీతండాకు చెందిన ధరావత్ రవీందర్ (27) రక్తం వాంతులు చేసుకొని మృతి చెందినట్లు ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం. కూలీ పని చేస్తూ జీవించే రవీందర్ కొంతకాలంగా టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం గుంటూరులోని ఒక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లి తిరిగి కేసముద్రం రైల్వేస్టేషన్‌కు గురువారం తెల్లవారుజామున చేరుకున్నాడు. రైల్వేస్టేషన్ ఆవరణలో రక్తం వాంతులు వస్తుండగా అక్కడి నుంచి బయటకు నడుచుకుంటూ వచ్చి కుర్చొని మరింత రక్తం వాంతి చేసుకొని మృతి చెందాడు. తెల్లవారుజామున రైల్వేస్టేషన్ ఆవరణలో రవీందర్ మృతదేహం ముఖంపై రక్తం ఉండడంతో హత్య జరిగిందని భావించి, మండల కేంద్రంలో కలకలం రేపింది. అనంతరం జరిపిన ప్రాథమిక విచారణలో రవీందర్ మృతిపై స్పష్టత వచ్చింది. ఈ మేరకు మృతిని భార్య అనూష ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు మహబూబాబాద్‌కు తరలించారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఘటనా స్థలాన్ని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, జీఆర్‌పీ సీఐ పి. సురేందర్ పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం 15 నవంబరు 2024 7

సంక్షేమం సగమే..



భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి పాటుపడుతున్నామని పాలకులు చెబుతున్నా ఆ మేరకు ఫలితాలు కనిపించడం లేదు. జిల్లాలో చేపల పంపిణీ అంతంత మాత్రంగానే సాగుతోంది. చెరువులు నిండుకుండల్లా ఉంటున్నా జిల్లాలో మత్స్యసంపద కరువైంది. సర్కారు ఉచితంగా చేపడుతున్న చేపల పంపిణీ కుంటుపడుతోంది. లక్ష్యంలో సగం మాత్రమే నెరవే రిందని తెలుస్తోంది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని వందశాతం చేపట్టగా ప్రస్తుత సర్కారు 50 శాతానికే పరిమితమైందని లెక్కలు చెబుతున్నాయి.

జిల్లాలో 2.93 కోట్ల చేపలు పంపిణీ చేయాల్సి ఉండగా ఈ ఏడాది 1.46 కోట్లతోనే అధికారులు సరిపెడుతున్నారు. అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ లేకపోవడంతో 30 లక్షల చేపల పంపిణీ రద్దు చేశారు. దీంతో ఈఏడాది 1.16 కోట్ల చేపలు మాత్రమే పంపిణీ జరగనుంది. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు జలకళతో ఉట్టిపడుతున్నాయి. 832 చెరువుల్లో దాదాపు అన్ని అలుగు పోశాయి. చెరువులు పూర్తిగా నిండినా ఇప్పటి వరకు ఉచిత చేపల పంపిణీ పూర్తిస్థాయిలో చేసింది లేదు.

టార్గెట్ 2.93 కోట్లు.. పంపిణీ 1.46 కోట్లే..

జిల్లాలో మొత్తం 118 మత్స్యపారిశ్రామిక సంఘాలు ఉన్నాయి. వీటిలో 9,250 మంది సభ్యులు ఉన్నారు. ప్రత్యేక్షంగా, పరోక్షంగా సుమారు 40వేల మంది మత్స్య పరిశ్రమపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఈఏడాది జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లల్లో 2.93 కోట్ల చేపల పంపిణీకి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత ఏడాది 2.57 కోట్ల చేపలు పంపిణీ చేస్తే ఈసారి అదనంగా మరో 35 లక్షలు చెరువుల్లో వదిలేందుకు ప్రతిపాదించారు. జిల్లాలోని 832 చెరువులు, కుంటలతోపాటు గణపురం, భీంఘన్‌పూర్, అన్నారం, మేడిగడ్డ జలాశయాల్లో చేపల పంపిణీ చేయనున్నారు. అయితే..


గణపురం చెరువులో చేపలు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే సత్యనారాయణరావు (ఫైల్)

- మత్స్యకారులకు అరకొర ఉపాధి
- భూపాలపల్లి జిల్లాలో 50 శాతమే చేపల పంపిణీ
- చెరువులు నిండుకుండల్లా ఉన్నా నెరవేరని లక్ష్యం
- ఈ ఏడాది 1.16 కోట్ల పిల్లను మాత్రమే వదులుతున్న వైనం

జిల్లాలో పంపిణీ చేస్తున్న చేప పిల్లల వివరాలు

మండలం	మొత్తం చెరువులు	పంపిణీ చేసే చేప పిల్లలు (లక్షల్లో)
భూపాలపల్లి	82	15.90
చిట్యాల	82	9.99
గణపురం	67	15.36
కాటారం	109	14.67
మహదేవపూర్	58	35.34
మహాముత్తారం	31	3.48
మల్హర్	45	11.86
మొగుళ్లపల్లి	113	10.46
పలిమెల	6	0.86
రేగొండ	153	19.66
టేకుమట్ల	8	9.29

ఈసారి జిల్లాకు నిర్దేశించుకున్న లక్ష్యంలో సగం మాత్రమే ప్రభుత్వం పంపిణీకి ముందుకు వచ్చింది. దీంతో 1.46కోట్ల చేపల పంపిణీ మాత్రమే జరుగుతోంది. ఇప్పటికే జిల్లాలోని

మిగతా 8వ పేజీలో...



ఆర్టీసీ భూపాలపల్లి డిపో మేనేజర్ అమంచ ఇందు

ఇబ్బందుల్లేకుండానే సర్వీసులు నడిపిస్తాం

ఆంధ్రజ్యోతి: భూపాలపల్లి ఆర్టీసీ సేవలు ఎలా ఉన్నాయి?

డీఎం: ప్రస్తుతం భూపాలపల్లి డిపో రూ. 5.94 కోట్ల లాభాల్లో నడుస్తోంది. రోజుకు 35,908 కిలో మీటర్ల మేర బస్సులను తిప్పాల్సి ఉంది. రోజుకు సుమారు 45,400 మంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలు అందుతున్నాయి. ఇందులో సుమారు 31 వేల మంది మహిళా ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మీ డిపో పరిధిలోని అన్ని గ్రామాలకూ ఆర్టీసీ సేవలు అందడంలేదు. ఈ సమస్యను ఎలా అధిగమిస్తారు?

డీఎం: ప్రస్తుతం ఏయే గ్రామాలకు ఆర్టీసీ బస్సులు తీరుగు తున్నాయో.. తెలుసుకుని రద్దీనిబట్టి ఉన్నతాధికారులతో చర్చించాక ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తాం. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా సర్వీసులను నడిపిస్తాం..

ఆంధ్రజ్యోతి: భూపాలపల్లి బస్టాండ్‌లో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సర్వీసులు సరిగా అందుబాటులో ఉండక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై మీ స్పందన?

డీఎం: బస్సుల టైమింగ్‌ను పరిశీలించాక ప్రయాణికుల రద్దీనిబట్టి సర్వీసులను అందుబాటులో ఉంచుతాం. సాయంత్రం వేళల్లో ఏరూట్లలో ప్రయాణికులు అధికంగా ఉంటున్నారో తెలుసుకుని వారికి సరిపడా బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: డిపోలో ఉన్న సిబ్బంది కొరతను ఎలా పరిష్కరిస్తారు?

డీఎం: నేను కొత్తగా బాధ్యతలు చేపట్టాను. పూర్తి వివరాలు తెలుసుకుని ఈ సమస్యపై క్షుణ్ణంగా స్టడీ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

ఆంధ్రజ్యోతి: సెలవులు దొరకడం లేదని కార్మికులు చెబుతున్నారు. ఈ సమస్యను ఎలా అధిగమిస్తారు?

డీఎం: ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ సమస్యను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తా.

ఆంధ్రజ్యోతి: డిపోలో ఉద్యోగులు తాగేందుకు వాటర్ ప్లాంట్ లేదు. పార్కింగ్ షెడ్ లేక వారు ఇబ్బందులు పడుతున్నారు

డీఎం: త్వరలోనే ఆ సమస్యలను పరిష్కరిస్తాం.

- కాకతీయఖని (ఆంధ్రజ్యోతి)

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి


గుర్తుతెలియని మహిళ (ఫైల్)

ములుగు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగులోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. ఈమేరకు ఎస్సై వెంకటేశ్వర్‌రావు గురువారం తెలిపారు. ఇటీవల వెంకటాపురం మండలంలోని ఆలుబాకలో ఒంటరిగా ఉండి ఇబ్బంది పడుతున్న మహిళను స్థానిక ప్రజలు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారని అన్నారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. మహిళ ఆచూకీ తెలిసినవారు 8712670081, 8712670082 సెల్ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

వెంకటాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంకలవాగు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి ఏటూరు నాగారం వెళ్తున్న 102 వాహనాన్ని వాజేడు మండలం చెరుకూరు నుంచి వెంకటాపురానికి వస్తున్న ఆటో కంకలవాగు సమీపంలో ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న నూగూరు గ్రామానికి చెందిన రమణ, రాధిక, పోసాని, ధర్మారం గ్రామానికి చెందిన రాంబాబులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ములుగు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న విద్యార్థి రాజేష్

ములుగు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ములుగు జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల ప్రకారం... ములుగు మండలం బండారుపల్లి తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకులంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తుమ్మ రాజేష్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామంలోని తన మేనమామ సారంగపాణి సంరక్షణలో ఉన్నాడు. ఆధార్‌కార్డు అప్‌డేట్ కోసం అనుమతి తీసుకుని బుధవారం గురుకులం నుంచి వెళ్లిన రాజేష్ గురువారం మధ్యాహ్నం తిరిగి వచ్చాడు. గురుకులం సమీపంలోని ఓ చెట్టు కింద కూర్చున్న అతడిని విద్యార్థులు గుర్తించారు. వారు దగ్గరికి వెళ్లగా తాను పురుగులమందు తాగినట్లు చెప్పి స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం రాజేష్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

కమనీయం.. వేంకన్న కల్యాణం

- వైభవంగా ప్రారంభమైన బుగులోని జాతర
- తిరుమలగిరి నుంచి గుట్టకు చేరిన స్వామివారు


స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రేగొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బుగులోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు జాతర కనుల పండువగా సాగింది. తిరుమలగిరి గ్రామంలోని అర్చకుడు కూర్మాచలం వెంకటేశ్వర్లు ఇంటి నుంచి ఉదయం స్వామివారి ఊరేగింపు ప్రారంభమై బుగులోని గుట్ట వరకు కొనసాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోలాటాలు, డప్పు చప్పుళ్లు, గోవింద నామ స్మరణతో గ్రామ పరిసరాలు మార్మోగాయి. సాయంత్రం స్వామివారి కల్యాన్ని వైభవంగా నిర్వహించారు. బుగులోని గుట్ట వద్ద వెంకటేశ్వరస్వామి, పద్మావతి, అలివేలు మంగలను పట్టువస్త్రాలతో, పూలతో అలంకరించిన అర్చకులు మంత్రోచ్చరణలు, సంగీత వాయిద్యాల నడుమ ఈ ఘట్టాన్ని జరిపించారు. భక్తులు, తిరుమలగిరి గ్రామస్థులు తనవితీరా తిలకించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకుడు కూర్మాచలం వెంకటేశ్వర్లు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. జాతర ప్రారంభమైన నేపథ్యంలో డీపీవో సత్యనారా యణరావు పర్యవేక్షణలో పారిశుధ్య నిర్వహణ ముమ్మరంగా సాగింది. సీఐ మల్లేష్ యాదవ్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ వెంకటస్వామి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


కోలాటాల మధ్య స్వామివారిని గుట్టపైకి తీసుకొస్తున్న భక్తులు

పుస్తక పఠాన్ని అలవర్చుకోవాలి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కలెక్టర్ దివాకర అన్నారు. జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా వారంరోజులపాటు జరిగే వివిధ కార్యక్రమాలను జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో ఆయన గురువారం ప్రారంభించారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయం చదువుల నిలయమని, ప్రతిరోజు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం అనంతరం ప్రజలు కడు పేదరికంలో అనేక ఇబ్బందులు పడుతున్న సమయంలో జవహర్‌లాల్‌నెహ్రూ పిల్లలు చదువుకోవడానికి పలు కార్యక్రమాలు ప్రారంభించారని గుర్తుచేశారు. విద్యార్థులు 22సంవత్సరాలలోపు ఉన్నత చదువులు చదివి మంచి జీవితాన్ని ఎంచుకోవాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు. జిల్లాకేంద్రంలో నూతన గ్రంథాలయ భవనాన్ని నూతన హంగులతో నిర్మించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అలివేలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ దివాకర, చైర్మన్ రవిచందర్

'గ్రూప్-3'కు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 14: గ్రూప్-3 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో గురువారం సమావేశమయ్యారు. గ్రూప్-3 పరీక్షకు జిల్లాలో 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశామని తెలిపారు. 3,707 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు 17 మంది పరిశీలకులు, 34 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఒక బయోమెట్రిక్ సూపర్‌వైజర్, ఐదుగురు రూట్ అధికారులను నియమించినట్లు వివరించారు. ఉదయం 7 గంటలకే సిబ్బంది పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ప్రశ్న పత్రాలను పోలీసు అధికారుల భద్రత నడుమ తరలించనున్నట్లు చెప్పారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రత్యేక గదులను కేటాయించాలన్నారు. ఈనెల 17న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి పేపర్, సాయంత్రం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు అరగంట ముందే పరీక్షల కేంద్రాల గేట్లను మూసివే యాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు సరఫరా చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతిలేదన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్‌ను విధించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పరీక్ష నోడల్ అధికారి విజయలక్ష్మి, పోలీసు నోడల్ అధికారి బోనాల కిషన్, పరీక్ష కోఆర్డినేటర్ వెంకన్న, ఆర్డీవో సమ్మానీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

రైతులకు బాసటగా సర్కారు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


సహకార దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేసి బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు ఆధ్వర్యంలో సహకార వారోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. నెహ్రూ, ఇందిగాంధీ, రాజీవ్‌గాంధీల హయాంలోనూ రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. అనేక సంస్కరణలు తెచ్చి దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసిన ఘనత ఆనాటి ప్రధానులదని అన్నారు. అదే స్ఫూర్తితో రేవంత్ సర్కార్ రైతులతోపాటు అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నారని అన్నారు. రైతుబంధు పథకం అమలు విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రియల్‌ఎస్టేట్ భూములు, వేలాది ఎకరాల వ్యవసాయ భూములు కలిగిన వారికి ఈ పథకాన్ని వర్తించొద్దనే ఉద్దేశంతో మార్గదర్శకాలు తయారు చేస్తున్నామని తెలిపారు. రాబోయే పంట కాలానికి రూ. 7,500 రైతుబంధును అర్హులైన రైతులకు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్‌ఎస్‌ఆర్ సంపత్‌రావు, మోడెం ఉమేష్‌గౌడ్, మేకల భిక్షపతి, వీరబ్రహ్మం, మటిక సంతోష్, కొలెపాక సాంబయ్య, ఏనుగు రవిందర్‌రెడ్డి, పున్నం రవి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

కాకతీయఖని, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-3లో విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. గురువారం విజిలెన్స్ అధికారులు గని ఆపరేషనల్ మేనేజర్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులను విచారించినట్లు తెలిసింది. జీఎం కార్యాలయంలో క్వాలిటీ అధికారులతోపాటు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అధికారును విచారించినట్లు సమాచారం. అలాగే 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. మీటర్ రీడింగ్ మారింది వాస్తవమేనా...? అంత జరుగుతుంటే మీరేం చేస్తున్నారని ఆయా విభాగాల అధికారులను విజిలెన్స్ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్‌కు ఎందుకు సహకరిస్తున్నారని అడిగినట్లు సమాచారం.

కలెక్టరేట్ ఉద్యోగుల నిరసన



భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 14: వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై దాడికి వ్యతిరేకంగా కలెక్టరేట్‌లో కార్యాలయంలో ఉద్యోగులు టీజేఏసీ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. టీజేఏసీ జిల్లా చైర్మన్ బురుగు రవి, టీఎన్జీవోస్ కార్యదర్శి దశరథరామారావు, టీఎన్జీవో సహ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ములుగు కలెక్టరేట్ వద్ద..

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగయ్యనాయక్, కొడంగల డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి వెంకటరెడ్డి, ఇతర ఉద్యోగులపై దాడిని ఖండిస్తూ గురువారం ములుగులోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అధికారులపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ భాగస్వామ్య సంఘాల నాయకులు పోలురాజు, టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సంపత్‌రావు, నాయకులు వేం యాకూబ్‌రెడ్డి, రవికాంత్, మేడి చైతన్య, జీవన్‌కుమార్, రామకృష్ణ, అప్పలనాయుడు, పిట్టల రవి, టి.ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద..

ఏటూరునాగారం(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్‌పై దాడిని ఖండిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. తహసీల్దార్ గుర్రం జగదీశ్వర్, కార్యాలయ ఇతర అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మండల సర్వేయర్ తాటి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ కబ్బాక ధనలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ గంపల శంకర్, జబ్బ నాగేశ్వరరావు, వడ్డారపు నర్సింగరావు, గోగు విజయలక్ష్మి, తోలెం వెంకట నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



ములుగు కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల నిరసన

ఎంపీడీవో కార్యాలయం వద్ద..

మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్, అధికారులపై దాడిని ఖండిస్తూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప ఆలయ ట్రస్టుబోర్డు పదవులపై గురి

దక్కించుకునేందుకు ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు



వెంకటాపూర్, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం ధర్మకర్త (చైర్మన్) పదవిని దక్కించుకు నేందుకు పలువురు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నట్లు సమా చారం. రాష్ట్ర దేవాదా య శాఖ గత ఆగస్టు 29న నూతన పాలక మండలి ఏర్పాటు కోసం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు చైర్మన్, డైరెక్టర్ల పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఒక చైర్మన్‌తోపాటు డైరెక్టర్లను నియమించను న్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా పాలకవర్గం లేకుండానే ప్రతి ఫిబ్రవరిలో మహాశివ రాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. సుదీర్ఘకాలం తర్వాత పాలక వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుం డటంతో మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు చైర్మన్‌గిరి కోసం పోటీ పడుతున్నారు. డైరెక్టర్ పదవుల కోసం కూడా అనేకమంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రమంత్రి, స్థానిక ఎమ్మెల్యే సీతక్క అండదండలతో ఈ పదవులు ఎవరికి దక్కనున్నాయో ఈనెలాఖరు వరకు తేలనున్నట్లు సమాచారం.

గతంలో ధర్మకర్తలు వీరే...

మండలంలోని రామాంజాపూర్ గ్రామానికి చెందిన ఆశీం చక్రవరి 1988-89 వరకు, పాలంపేట గ్రామానికి చెందిన ముప్పిడి లక్ష్మీనారాయణ 1990-91 వరకు, పాలంపేట గ్రామానికి చెందిన వీరమల్ల శ్రీనివాసరావు 1991-94వరకు, రామాంజాపూర్ పరిధిలోని గుంటూరుపల్లికి చెందిన దుద్దిళ్ల భిక్షపతి 1993-95 వరకు, రామాంజాపూర్ గ్రామానికి చెందిన చుందూరు నాగశ్రీ 1995-96, లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన వీరగోని సాంబయ్యగౌడ్ మూడునెలలు, పాలంపేట గ్రామానికి చెందిన మార్క జయశంకర్‌గౌడ్ 2004-2010వరకు, లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన తండ రమేష్ 2010-12వరకు, నల్లగుంట గ్రామానికి చెందిన పోతుగంటి సదాశివరెడ్డి రామప్ప పునరుద్ధరణ కమిటీ ద్వారా మూడునెలలు కొనసాగారు. తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2016-17 వరకు వీరు చైర్మన్‌గా కొనసాగారు. 2017 నుంచి ప్రస్తుత 2024వరకు సుమారు ఎనిమిది సంవత్సరాలుగా రామప్పకు ధర్మకర్త లేకపోవడం వల్ల ఖాళీగా ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశాభావం రేకెత్తుతోంది. రామప్ప చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

న్యూస్ రీల్

ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలే ప్రధానం

సింగరేణి ఇన్‌చార్జి జీఎం వెంకట్రామిరెడ్డి

కాకతీయఖని, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రగతికి బొగ్గు ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలే ప్రధానమని సంస్థ భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం వెంకట్రామిరెడ్డి అన్నారు. బొగ్గు నాణ్యత వారోత్సవ కార్యక్రమాన్ని స్థానిక జీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో విదేశాల నుంచి దిగుమతి అవుతున్న బొగ్గుకు దీటుగా సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును అందించేందుకు ప్రమాణాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, జ్యోతి, రవికుమార్, సురేఖ, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ములుగు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా పరిధిలో డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు వరంగల్-2 డిపో మేనేజర్ వి.జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమంలో ప్రయాణికులు పాల్గొని 9959226048 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు అందించాలని ఆమె కోరారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

మేడారం, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సైబర్ నేరాలపై గురువారం అవగహన కల్పించారు. గుర్తుతెలియని ఫోన్‌కాల్స్, మెస్సెజ్‌లు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

గోవిందరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఈనెల 15నుంచి 25 వరకు బూత్ అధ్యక్షులను ఎన్నుకుని బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి జినుకల కృష్ణాకర్‌రావు కోరారు. మండల కేంద్రంలో మండల స్థాయి కార్యశాల మార్క సతీష్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ జాడి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు కొత్త సుధాకర్‌రెడ్డి, చందా జ్యోతి, నామ వరపు విజయలక్ష్మి, మేరుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుంగలను తరలిస్తున్న ఎడ్లబండ్ల పట్టివేత

ములుగు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలప దుంగలను తరలిస్తున్న మూడు ఎడ్లబండ్లను ములుగు అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. వెంకటాపూర్ మండలం నుంచి పెద్దేగి, టేకు దుంగలను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రేంజ్ అధికారి డోలి శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ఉదయం జిల్లాకేంద్రం సమీపంలోని డీఎల్ఆర్ గార్డెన్ వద్ద స్వాధీనపరచుకున్నారు. కలప బండ్లను రేంజ్ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న కలప విలువ రూ.లక్షా20వేలు ఉంటుందని తెలిపారు. ఈదాడిలో సెక్షన్ ఆఫీసర్ ఎ.రవీందర్, బీట్ ఆఫీసర్ రూప్‌కుమార్, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

వెంకటాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి నవీన్ అన్నారు. గురువారం మండలంలోని పాత్రాపురం రైతువేదికలో ఎరువులు, పురుగుమందుల షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను రైతులకు విక్రయించాలన్నారు. ఈసమావేశంలో ఏఈ వోలు శ్యామ్ కుమార్, ప్రియాంక, శ్రీకన్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కాటారం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగూడెం, శంకరంపల్లి పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం సంఘం వైస్ చైర్మన్ దబ్బెట స్వామి ప్రారంభించారు. పీఏసీఎస్ డైరెక్టర్లు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఐలి రాజబాపు, జక్కుల అజయ్ కుమార్, దండ్రు రాజయ్య, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వంశవర్ధన్‌రావు, శంకరంపల్లి మాజీ సర్పంచ్ అంగజాల అశోక్, సీఈవో సతీష్, అసిస్టెంట్ సీఈవో గోపాల్, ఏఈవోలు సరిత, అస్మా, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి

వెంకటాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్‌ను మాదిగలు బలోపేత చేయాలని ఆసంఘం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల మండల స్థాయి సమావేశం కాడపాక శ్యాం అధ్యక్షతన గురువారం జరిగింది. సతీష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మోరె లింగస్వామి, అధికార ప్రతినిధిగా అల్లకొండ కుమార్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా దొమ్మటి రమేష్, కార్యదర్శిగా కరుణాకర్ ఎన్నికయ్యారు.

ఘనంగా బాలల దినోత్సవం





భూపాలపల్లిలో జరిగిన బాలల దినోత్సవాల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన, మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జయరాంరెడ్డి హాజరయ్యారు. బాలలు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మంగిలాల్, సంక్షేమ శాఖ జిల్లా అధికారి చెన్నయ్య, డీపీఆర్వో శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ రాజారత్నంతో పాటు న్యాయ వాదులు మంగళంపల్లి రాజ్‌కుమార్, సంధ్య పాల్గొన్నారు. అలాగే భూపా లపల్లిలోని వివిధ పాఠశాలల్లో బాలల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

- ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లా సంక్షేమ అధికారి శిరీష అధ్యక్షతన జాతీయ బాలల హక్కుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా కలెక్టర్ దివాకర హాజరయ్యారు. బాలలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో హింస తగ్గే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ ఝాన్సీలక్ష్మి, సీడీపీవోలు మల్లీశ్వరి, ప్రేమలత, ధనలక్ష్మి, బాలసదనం సూపరింటెండెంట్ సుమతి, సూపర్‌వైజర్ రమాదేవి, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- మహాముత్తారం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్, ములుగుపల్లి జడ్పీ హైస్కూల్‌లో నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తహసీల్దార్‌డి.శ్రీనివాస్, ఎంఈవో సంజీవరెడ్డి టీషర్టులు అంద జేశారు.
- ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో నెహ్రూ జయంతిని నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, బీసీ సెల్ టౌన్ అధ్యక్షుడు వలస తిరుపతి, ఇర్సవడ్ల కిరణ్, నెగరికంటి ముతేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.
- కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగూడెం ఎంపీపీఎస్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సారక, ప్రధానోపాధ్యాయుడు కోరగట్ల రవీందర్, ఉపాధ్యాయులు సతీష్, రాజు లావణ్య తదితరులు పాల్గొన్నారు.
- మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల విద్యాలయం, కొర్కిశాల కేజీబీవీ విద్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంజేపీ ప్రిన్సిపాల్ శారద, కేజీబీవీ ప్రత్యేక అధికారి శైలజ, పీఈటీ శ్రావణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- మేడారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- వాజేడు (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు సోయం ఆనదంరావు, స్వరూప్‌సింగ్, శ్రీకాంత్, ప్రభాకర్, కుమార్‌బాబు, కోకిల శ్రీరంగం, రాజ్యలక్ష్మి, రాజేష్ సిందే, వశ్యా, అమ్మాజీరాణి తదితరులు పాల్గొన్నారు.
- కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మాల్లో ఎంఈవో శ్రీదేవి, పాఠశాలల హెచ్‌ఎంలు కరుణాకర్‌రావు, వెంకటేశ్వర్లు, కార్తీక్‌రావు, వెంకటేష్ గౌడ్, సంపత్‌రావు, శ్రీశైలం, గోవర్ధన్, ఉమారాణి, కృషి త, శ్రీదేవి, శైలజ, సునీత, ఉపాధ్యాయులు రాజబాబు, కిషన్‌నాయక్, జయ రాజ్, పరంసింగ్, శారద, రాజారాం, రవీందర్, హారిక, నవ్య, రమేష్ పాల్గొన్నారు.
- వెంకటాపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ పోశాల వీరమల్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజయ్య ఉపాధ్యాయులు రాంచందర్, రామ్మోహన్, భవాని, మాలతి, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వడ్ల సేకరణ పకడ్బందీగా చేపట్టాలి



రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఎస్పీ కిరణ్ ఖరే

కాటారం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వడ్ల సేకరణ పకడ్బందీగా చేపట్టి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఎస్పీ కిరణ్ ఖరే అధికారులను, కేంద్రాల నిర్వహకులకు ఆదేశించారు. మండలంలోని శంకరంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంని గురువారం వారు సందర్శించారు. వడ్ల సేకరణ, రోజువారీగా జరిగే కొనుగోళ్లు, కాంటాలు, గన్నీసంచులు, గతంలో తలెత్తిన రైతుల సాధకబాదకాలను పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులు, కేంద్రాల నిర్వహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన పనులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ, సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ పంట ఉత్పత్తులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మిల్లుల వద్ద వేబ్రిడ్జి కాంటాలు సక్రమంగా ఉన్నాయా లేదా చెక్ చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు వడ్లను తేమ శాతం 17లోపు, శుభ్రపర్చి నాణ్యతగా ఉంచితే ఇబ్బందులు రావన్నారు. రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వారి వెంట కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, కాటారం, పలిమెల ఎస్సైలు అభినవ్, థామస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ దబ్బెట స్వామి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంశవర్ధన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో సతీష్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఆవరణలో గురవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. భూపాలపల్లి గ్రంథాలయానికి నూతన భవనాన్ని అందుబాటులోకి తెచ్చి అన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. అంతకు ముందు జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గణపురం (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన చెల్పూరులోని నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. రాబోయే రోజుల్లో పీహెచ్‌సీలో అన్ని సేవలు అందుబాటులో ఉంచుతామన్నారు. పీహెచ్‌సీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మధుసూధన్, నాయకులు రాజేందర్, కావటి రవి, అశోక్, కొత్త వెంకన్న, తిరుమల్‌రావు, పిన్నింటి మాధవరావు, చోటే మియా, కుమార్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్

కాటారం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుల గూడెం, ధన్వాడ, శంకరంపల్లి, మల్హర్ మండలంలోని కొండంపేటలో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొను గోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ గురువారం సందర్శించారు. నిబంధనల మేరకు ధాన్యం సేకరణ చేయాల న్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, ఎఫ్ఏక్యూ (ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ) మార్గదర్శకాలపై రైతులకు అవగాహన కల్పించాలని నిర్వాహకులను ఆదేశిం చారు. ఆయన వెంట డీసీఎస్‌వో శ్రీనాథ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ స్వామి, సీఈవో సతీష్ ఉన్నారు.

మంత్రి శ్రీనివాసరెడ్డికి భూనిర్వాసితుల వినతి

మల్హర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డేంజర్ జోన్‌లో ఉన్న తమను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మండలంలోని తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్‌కో ఓపెన్‌కాస్టు భూనిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. భూనిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ నేతలు మంత్రిని హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో గురువారం కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. జెన్‌కో ఓపెన్‌కాస్టు డేంజర్ జోన్‌లో ఉండటం వల్ల నిత్యం బ్లాస్టింగులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమ ఇళ్లను సేకరించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. అలాగే నిర్వాసితులకు జ ్ ల ో ఉద్యోగావ కాశం కల్పించాలన్నారు. కాపురం శివారులో ఎస్సీ, ఎస్టీలకు చెందిన చిన్న, సన్న కారు రైతులకు పరి హారం అందించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న రవి

ఘనంగా సహకార వారోత్సవాలు

కాటారం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో 70వ సహకార వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట వైస్‌చైర్మన్ దబ్బెట స్వామి సహకార జెండాను ఎగురవేశారు. సంఘం డైరెక్టర్లు ఐలి రాజబాపు, జక్కుల అజయ్ కుమార్, దండ్రు రాజయ్య, సీఈవో ఎడ్ల సతీష్, సిబ్బంది గోపాల్, అమీన్, సాంబమూర్తి, రాజబాపు, పవన్, కార్తీక్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వాజేడులో..

వాజేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ యగ్గడి అంజయ్య జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వత్సవాయి జగన్నాధరాజు, డైరెక్టర్లు జాడి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం సగమే..

(7వ పేజీ తరువాయి)

832 చెరువుల్లో 700 చెరువుల వరకు చేపల పంపిణీ పూర్తయింది. జూన్ నుంచి ఆగస్టు వరకు జరగాల్సిన ఉచిత చేపల పంపిణీ అక్టోబరులో ప్రారంభమైంది. ఆలస్యం గా మొదలు కావడంతో పూర్తి స్థాయిలో లక్ష్యాన్ని నెరవేరగలుగుతారా? అనే ప్రశ్న ఉత్పన్నమైంది. అయితే.. అనుకున్నట్టే జరిగింది. టార్గెట్‌లో సగంతోనే మాత్రమే ప్రభుత్వం సరిపెట్టుకుంటోంది. వంద శాతం టార్గెట్‌ను పూర్తి చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని చెప్పిన అధికారులుఉ అంతర్గత నిర్ణయం మేరకు 50 శాతానికే పరిమితమయ్యారు. దీంతో మత్స్యకారుల్లో ఆందోళనమొదలైంది. ప్రభు త్వం సగం చేపలనే పంపిణీ చేయడంతో వాటిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న కుటుంబాలు తీవ్ర నిరాశలో కురుకుపోయాయి.

ఎదుగుదలపై ప్రభావం

చెరువుల్లో చేపలను అధికారులు రెండు రకాలుగా వదులుతారు. నీరు నిల్వ ఉండే సామర్థ్యాన్నిబట్టి కొన్నింటిని నిర్ధారిస్తారు. పూర్తిగా నీటితో నిండి ఉన్న చెరువుల్లో 45 రోజుల వయసున్న 35-40 మిల్లీమీటర్ల చేపలు వదులుతారు. ఏడాది మొత్తం నీరు నిల్వ ఉండే చెరువులు, రిజర్వాయర్లల్లో 75 రోజుల వయసు ఉండే 90-100మిల్లీ మీటర్ల పొడవు ఉండే చేపలను వదులుతారు. పంపిణీ చేసిన చెరువులు దాదాపు కిలో సైజు పెరగడానికి ఆరు నెలల సమయం పడుతుంది. జూన్, జూలైలో రిజర్వాయర్లల్లో చేపలను వదిలితే అవి డిసెంబరు నుంచి రెండు, మూడు నెలలపాటు పట్టుకొని అమ్ముకొనే వీలు ఉంటుంది. సెప్టెంబరులో చేపలు వదిలితే అవి ఫిబ్రవరి వరకు పట్టుకొనే అవకాశం ఉంటుంది. వేసవిలో ఉష్ణోగ్రతల కారణంగా కొన్ని చేపలు చనిపోవడంతోపాటు బరువు తగ్గొచ్చు. తద్వారా ఆయా చెరువులపై ఆధారపడే మత్స్యకారులునష్టపోయే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా అక్టోబరులో పంపిణీ చేసిన చేపల పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుంది.

ప్రభుత్వ ఆదేశాలనుసారమే..

అవినాష్, మత్స్యశాఖ జిల్లా అధికారి (భూపాలపల్లి)



జిల్లాలో చేపల పంపిణీ ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాలనుసారం పూర్తి చేస్తున్నాం. టెండర్ తదితర కారణాలతో అనుకున్న టార్గెట్‌లో 50శాతం చేపలనే చెరువుల్లో వదులుతున్నాం. జిల్లాల్లో 1.10 కోట్లచేపలను ఈఏడాది పంపిణీ చేస్తున్నాం.

తప్పుడు తూకంతో మోసగిస్తున్న వ్యాపారి

పోలీసులకు అప్పగించిన రైతులు

చిట్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు చేస్తూ తప్పుడు తూకంతో రైతులను మోసం చేస్తున్న వ్యాపారిని మండలంలోని గోపాలపురం రైతులు గురువారం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు... జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గుంజప డుగు గ్రామానికి చెందిన వ్యాపారి తూర్పాటి అశోక్ కొద్ది రోజులుగా మండ లంలోని గోపాలపురంలో రైతుల వద్దనుంచి పత్తి కొనుగోలు చేస్తున్నాడు. తక్కువ దిగుబడి వచ్చిన రైతులు మార్కెట్‌కు వెళ్లకుండా గ్రామంలోనే విక్ర యాలు జరుపుతున్నారు. ఈక్రమంలో తూకంలో అనుమానం వచ్చిన రైతు పుప్పాల శ్రీను 6.18 క్వింటాళ్ల పత్తిని వ్యాపారికి విక్రయించగా 4.98 క్వింటాళ్ల పత్తి తూకం చూపించడంతో ఖంగుతిన్నాడు. దీంతో పలువురు రైతులకు సమాచారం ఇవ్వడంతో వ్యాపారిని నిలదీశారు. ఆ వ్యాపారి పొంతనలేని సమాదానం చెబుతుండటంతో వాహనం టైర్లలో గాలితీసి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకుని వ్యాపారి అదుపులోకి తీసుకున్నారు. ఈసంఘటనపై స్థానిక ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా రైతుల సమాచారంతో వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

ఏటూరునాగారం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని ఆంజ నేయస్వామి ఆలయం వద్ద 45 అడుగుల భారీ హను మాన్ విగ్రహ ఏర్పాటుకు గురువారం భూమి పూజ జరిగింది. ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహరావు హాజరయ్యారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, సాయి బాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కేటీపీపీలో ఓవరాల్ పనులు

గణపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశలో విద్యుత్ ఉత్పత్తిని ఇంజనీరింగ్ అధికారులు నిలిపివేయను న్నారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సౌధా ఆదేశాలతో 45రోజుల పాటు రెండో దశ 600 మెగావాట్లలో ఓవరాలింగ్ పనులు చేపట్టనున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా టర్బైన్, ఎలక్ట్రికల్ విడి భాగాలు, బాయిలర్, జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్స్ మరమతులు చేయనున్నారు. శుక్రవారం రెండో దశ షట్‌డౌన్ చేసి శనివారం నుంచి పనులు చేపట్టనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.